



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 25 జూన్ 2025 పేజీలు 8




# గరంగరంగా కౌన్సిల్

- ఉద్యోగుల పనితీరు సక్రమంగా లేదని నినదించిన కార్పొరేటర్లు
- విధుల్లో అలసత్వం వహిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకొనేలా నిర్ణయం
- ఆస్తిపన్ను 20 శాతం అదనంగా వసూలుకు తాజా ప్రభుత్వ సర్క్యులర్ పైనా చర్చ...
- ఐలాకు నీరు ఇవ్వాలంటూ టీడీపీ ప్రతిపాదన..తిరస్కరించిన వైసీపీ
- మంచినీటి సమస్యకు చెక్ పెట్టేలా అధికారులకు మేయర్, కార్పొరేటర్ల సూచనలు
- మున్సిపల్ కార్మికుల జీతాల సమస్యకు వచ్చే కౌన్సిల్ తీర్మానం చేసేలా నిర్ణయం
- ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజీపడేది లేదన్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

6

మేయర్ స్థానంలో కౌన్సిల్‌ను నడిపిన

## డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



- అనివార్య కారణాల రీత్యా మధ్యాహ్నం నుంచి హాజరుకాని మేయర్

6 లో



నేర రహిత నగరంగా

# విజయవాడ

- సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల తగ్గిన నేరాల సంఖ్య
- పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని 9 కాలనీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, సీపీ రాజశేఖర్‌బాబు

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేర రహిత నగరంగా విజయవాడను తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, పోలీస్ కమీషనర్ ● 2లో..



వినియోగదారుల హక్కులపై

## అవగాహన అవసరం

- ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన జిల్లా కన్స్యూమర్
- కమిషన్ మీడియేషన్ సెంటర్ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి

2 లో

## డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చుదిద్దుతాం

- పైలట్ ప్రాజెక్టుగా ఎన్‌టీఆర్ జిల్లా ఎంపిక
- రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్



# నేర రహిత నగరంగా విజయవాడ

(మొదటిపేజీ తరువాయి)

రాజశేఖర్‌బాబు చెప్పారు. మంగళవారం తూర్పు నియోజకవర్గంలోని పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని 9 కాలనీల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఎన్ఏసీ కళ్యాణ మండపంలో జరిగింది. విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్, నగర పోలీస్ కమీషనర్ రాజశేఖర్ బాబు పాల్గొని సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ తాను ఎంపీగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసి ఈ రోజుకు ఏడాది పూర్తి అయ్యిందన్నారు. ఎంపీగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న తర్వాత తాను ఇలాంటి మంచి కార్యక్రమంలో తాను పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాలు చేయడం, నిత్యం ప్రజల మధ్యన ఉంటూ వారికి సేవ, సహాయ కార్యక్రమాలు నిర్వహించడాన్ని తాను ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌ను చూసి నేర్చుకున్నానని చెప్పారు. ఎంపీగా విజయం సాధించడంలోనూ, ప్రజా సేవ చేయడంలోనూ ఇప్పటి వరకు తన చేయి పట్టుకుని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నడిపించారని ఎంపీ అన్నారు. విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖర్‌బాబు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేరాలను అదుపు చేసి ప్రజలకు మేలు జరిగేలా చూస్తున్నారని చెప్పారు. వరదల సమయంలో, దసరా ఉత్సవాల నిర్వహణలో పోలీస్ శాఖ అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిత్యం పోలీస్ శాఖ పనిచేస్తోందని ఎంపీ అన్నారు. డ్రోన్స్ సహాయంతో నగరంపై నిఘా పెట్టి నేరాలను అరికడుతున్నారని చెప్పారు. నేర రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆ దిశగానే పోలీస్ శాఖ పనిచేస్తోందన్నారు. పోలీస్‌శాఖకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి హోంశాఖా మంత్రి అనిత, డీజీపీ సహకారంతో అందచేస్తామని చెప్పారు. దాతల సహాయంతో ఎన్టీఆర్ జిల్లాలోని ప్రతి గ్రామం, మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకున్న జిల్లాగా ఇండియాలోనే ఎన్టీఆర్ జిల్లా పేరు తెచ్చుకుందని ఈ విషయాన్ని అతి త్వరలోనే హోంశాఖా మంత్రి అధికారికంగా ప్రకటిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ నేరాల నివారణకు అన్ని కాలనీల్లో సీసీలను ఏర్పాటు చేసుకోవాలని సీపీ రాజశేఖర్‌బాబు చెప్పడంతో దాతలు వెంటనే స్పందించి నియోజకవర్గంలోని 9 కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డ్రోన్స్‌ను ఉపయోగించి పోలీస్ శాఖ నేరాలను నివారిస్తున్నారని చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా కేసులను త్వరగా పరిష్కరిస్తున్నారని అన్నారు. ప్రతి మనిషి పొరుగు వారికి సహాయం చేయడంతో పాటుగా కాపాడే వారిగా ఉండాలన్నారు. ఏ అభివృద్ధి కార్యక్రమానికి అయినా స్వచ్ఛందంగా కాలనీ వాసులు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఎంతో ఓపికగా సమస్యలను విని వాటిని పరిష్కారానికి సహకారం అందిస్తున్నారని చెప్పారు. తూర్పు నియోజకవర్గ ప్రజలు తనను మూడో సారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించారని అన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల చెత్త పాలన వల్ల ప్రజలు విసిగి పోయారని అన్నారు. నారా చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, బీజేపీల కూటమి పాలన కావాలని ప్రజలు కోరుకున్నారని అందువల్లనే ఈ ఎన్నికల్లో ఇంత మెజార్టీ సాధించగలిగామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన కాన్వాయ్ కింద ఒక వ్యక్తి పడి మృతి చెందినా వాహనాన్ని ఆపకుండా మానవత్వం లేకుండా వెళ్ళిపోయాడని, అలాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తి జగన్ అని అన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను అరికట్టామని, గంజాయికి బానిస అయిన వారికి గంజాయి దొరక్కుండా చేయాలన్నారు. గంజాయి తీసుకున్న వారి గురించి సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీస్ శాఖకు తెలియజేయాలన్నారు.

విజయవాడ పోలీస్ కమీషనర్ శేఖర్ బాబు మాట్లాడుతూ నేరాల పరిశోధనలో సీసీ కెమెరాలను ఉపయోగించుకుంటున్నామన్నారు. అస్త్రం అనే టూల్‌ను వినియోగిస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంవల్ల నగరంలోనేరాల సంఖ్య చాలా తగ్గిందన్నారు. గంజాయి ఆగడాలు, అసాంఘిక కార్యక్రమాలు, చైన్ స్నాచింగ్‌లు, మోటార్ బైక్‌ల చోరీలు, యువకుల మధ్య గొడవలు చాలా వరకు



తగ్గాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాలను అదుపు చేస్తున్నామని చెప్పారు. నేరాలకు సంబంధించిన విషయాలను ప్రజలు పోలీస్ శాఖకు తెలియజేయాలన్నారు. ప్రజలు కూడా కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని సహకరించాలన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో డ్రైనేజీ, రోడ్లు, వీధిలైట్లు, వాటర్ పైపులు ఏర్పాటు చేసుకున్నామని, ఇప్పుడు అదే మాదిరిగా సీసీకెమెరాలను కూడా ఏర్పాటు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మిగిలిన అన్ని ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల కురిసిన వరదల వల్ల డివిజన్‌లోని పలు ప్రాంతాలు వర్షం నీటిలో నీట మునిగాయని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పుల్లేటి కాలువతో పాటుగా ఇతర ప్రధాన డ్రైయిన్లను అభివృద్ధి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. కాలనీ పెద్దలు గుళ్ళపల్లి నారాయణరావు, పాతూరి సాంబశివరావు మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల కాలనీల్లో ఏ సమస్య వచ్చినా వెంటనే గుర్తించవచ్చునని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల గంజాయి బ్యాచ్ ఆగడాలను నివారించవచ్చునన్నారు. పటమట సీఐ పవన్ కిషోర్ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కాలనీల్లోకి కొత్త వారి రాకపోకల గురించి తెలుసుకోవచ్చునని అన్నారు. ఏసీపీ దామోదరరావుతో పాటుగా కాలనీ పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో ఏసీపీ దామోదర్, కాలనీవాసులు ధనేకుల యలమందరావు, మైనేని సాయిబాబు, రామచంద్రారెడ్డి రాజారావు, గద్దె రమేష్, సీతారామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

## డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం




ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 24, మేజర్ న్యూస్ : రాష్ట్రాన్ని డంపింగ్ యార్డ్‌లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంలో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా రెండు క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్ అన్నారు. డంపింగ్ యార్డ్ రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్దే లక్ష్యంగా విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), కొలికపూడి శ్రీనివాసరావు, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, కొండపల్లి మునిసిపల్ కమిషనర్లతో నగరంలోని కలెక్టరేట్‌లో మంగళవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్ మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణ (వేస్ట్ మేనేజ్‌మెంట్)లో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోనే తొలి జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను డంపింగ్ యార్డ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో క్లస్టర్ విధానం అమలుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. గౌరవ పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో రెండు క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ మినహా జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, కొండపల్లి పట్టణ స్థానిక సంస్థలతో పాటు ఐదు వేలకు పైబడి ఉన్న దాదాపు 75 ప్రధాన గ్రామపంచాయతీలను గుర్తించి రెండు క్లస్టర్లుగా విభజించి ఏ రోజుకారోజుకే వ్యర్థాల ప్రాసెస్ అయ్యే విధంగా మోడల్ రూపొందించామన్నారు. జగ్గయ్యపేట, నందిగామ, కొండపల్లి నగర పంచాయితీలు వాటి పరిధిలోకి వచ్చే గ్రామాలు, తిరువూరు, మైలవరంతో పాటు పక్కనున్న నూజివీడుకూడా కవరయ్యేలా క్లస్టర్లను రూపొందించడం జరిగిందన్నారు. అక్టోబర్ 2వ తేదీ స్వచ్ఛతా దినోత్సవం రోజున తొలి క్లస్టర్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారి ఆదేశాల మేరకు రాష్ట్రాన్ని, అందులో భాగంగా జిల్లాను డంపింగ్‌యార్డ్ రహిత జిల్లాగా చేయాలనే గట్టి పట్టుదలతో ఉన్నామన్నారు. ఇందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అన్ని విధాలుగా పూర్తి సహకారం అందిస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్ అన్నారు. సమావేశంలో జగ్గయ్యపేట మునిసిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ డీటీవీ కృష్ణారావు, తిరువూరు ఛైర్‌పర్సన్ కె.నిర్మల, కమిషనర్ కె.మనోజ్, కొండపల్లి ఛైర్‌పర్సన్ సీహెచ్ చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన, నందిగామ ఛైర్‌పర్సన్ మహాలక్ష్మి, కమిషనర్ నూకరాజు, డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ పర్యటన ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర గవర్నర్ పర్యటన ఏర్పాట్లు కట్టుదిట్టంగా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈ నెల 25 వ తేదీ బుధవారం నగరంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొంటున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే రామ్ జి లతో కలసి విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. తొలుత విశ్వవిద్యాలయంలో రాష్ట్ర గవర్నర్ ప్రారంభించనున్న ఫుడ్ కోర్ట్ వద్ద జరుగుతున్న టెంటు, శిలాఫలకం ఏర్పాట్లను, వారు పరిశీలించి, వర్షం పడే సూచన ఉన్నందున పెద్ద సైజు టెంటును ఏర్పాటు చేయాలని, వెంటనే పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం వైయస్సార్ పరిపాలన భవనంలో ఉప కులపతి చాంబరు, దానికి ఎదురుగా ఉన్న సెనేట్ హాలును వారు పరిశీలించారు. తదుపరి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకాడమిక్ బ్లాక్ భవనం వద్ద గ్రీన్ రూమ్ ఏర్పాట్లు, అల్లూరి సీతారామరాజు ఆడిటోరియం లో వేదిక, వీఐపీ, అతిథులు, ప్రముఖులు మీడియా తదితరుల సీటింగ్ ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ రాష్ట్ర మానవ వనరులు ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రయాణించు మార్గంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, వారి వాహన శ్రేణి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు కూడా చేయాలని సూచించారు. తొలుత రాష్ట్ర గవర్నర్ విశ్వవిద్యాలయంలోని ఫుడ్ కోర్టును ప్రారంభించాక బ్యాటరీ కారులో వైయస్సార్ పరిపాలన భవనానికి చేరుకొని అక్కడ పోలీసు గౌరవ వందనం స్వీకరించాక ఉపకులపతి చాంబర్లో కార్యనిర్వాహక మండలి సభ్యులతో సమావేశం అవుతారన్నారు. అనంతరం అక్కడినుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకాడమిక్ బ్లాక్ వద్దకు చేరుకొని అక్కడ గ్రీన్ రూమ్లో కొంతసేపు ఉన్న తర్వాత పోలీసు బ్యాండ్ మేళంతో అల్లూరి సీతారామరాజు ఆడిటోరియం చేరుకొని స్నాతకోత్సవంలో పాల్గొంటారన్నారు. ఆడిటోరియంలో ఒక పద్ధతి ప్రకారం డిగ్రీల ప్రధానోత్సవం జరగాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వెంట శిక్షణలో ఉన్న కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, అదనపు ఎస్పీలు వివి నాయుడు, సత్యనారాయణ, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఉష, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, మచిలీపట్నం ఆర్డిఓ కే స్వాతి, డిపిఓ జే అరుణ, మున్సిపల్ కమిషనర్ కే బాపిరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వినియోగదారుల హక్కులు, అందుకు సంబంధించిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమీపంలో ఉన్న జిల్లా వినియోగదారుల ఫోరం కోర్టు ప్రాంగణంలో ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన జిల్లా కన్స్యూమర్ కమిషన్ మీడియేషన్ సెంటర్ భవనాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ న్యాయవ్యవస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అవసరమైన వసతులు కల్పించిన పక్షంలో వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేస్తాయన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా వినియోగదారుల కమిషన్ కు మీడియేషన్ సెంటర్ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు ఎంపీ నిధులను మంజూరు చేశామన్నారు. న్యాయాధికారుల అభ్యర్థన మేరకు కోర్టుకు రహదారిని నిర్మించే ప్రతిపాదనపై మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అదేవిధంగా త్వరలో నగరంలోని జిల్లా కోర్టును సందర్శిస్తామని, బార్ అసోసియేషన్ భవన నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు న్యాయవాదుల సౌకర్యార్థం అత్యుత్తమ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారుల చట్టాలపై ఇటు ప్రజలతోపాటు వస్తు ఉత్పత్తిదారులకు సైతం అవగాహన కల్పించాలని, తద్వారా తప్పిదాలకు ఎటువంటి ఆస్కారం ఉండదన్నారు. అదేవిధంగా నగరంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం, స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టామని, త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభిస్తామని ఎంపీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు దొమ్మేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంలో ఎంపీ, జిల్లా కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ కృషి అభినందనీ యమన్నారు. మీడియేషన్ సెంటర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించినందుకు ఎంపీకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ముడా ఛైర్మన్ మట్టా ప్రసాద్, జిల్లా కన్స్యూమర్ కమిషన్ ఛైర్మన్ నందిపాటి పద్మారెడ్డి మాట్లాడుతూ మీడియేషన్ సెంటర్ భవన నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని అభ్యర్థించిన వెంటనే ఎంపీ నిధులను తక్షణం మంజూరు చేసి ఆదుకున్నారన్నారు. కక్షిదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మీడియేషన్ సెంటర్ ఇరు వర్గాల మధ్య రాజీ కుదుర్చుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వినియోగదారుల చట్టం 2019 పట్ల అవగాహన కల్పిస్తూ, చట్టంలోని ప్రయోజనాలను వివరించారు. కొన్న వస్తువుకు నష్టం వాటిల్లినప్పుడు వినియోగదారుడు వస్తువు కొన్న ప్రాంతానికి వెళ్లకుండానే ఉన్న ప్రాంతంలోనే ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్సీ డి ఆర్ సి రిజిస్ట్రార్ శిరోభూషణం శ్రీనివాస్, జిల్లా కన్స్యూమర్ కమిషన్-2, విజయవాడ, ఛైర్మన్ ఎన్ చిరంజీవి, వినియోగదారుల కమిషన్ -1 సభ్యురాలు శ్రీలక్ష్మీ రాయల, వినియోగదారుల కమిషన్ -2 సభ్యులు ఏవీ రమణ, ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ సుధాకర్, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు, విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సోమ కృష్ణ మూర్తి, న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, న్యాయవాదులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాహసోపేత కొత్త గుర్తింపును ఆవిష్కరించిన బటర్ ఫ్లై

Butterfly

విజయవాడ, మేజర్ న్యూస్ : భారతదేశ అత్యంత విశ్వసనీయమైన వంటగది ఉపకరణాల బ్రాండ్లలో ఒకటైన బటర్‌ఫ్లై ఒక కొత్త పేజీని తిరగేస్తోంది. రిఫ్రెష్ చేయబడిన బ్రాండ్ గుర్తింపు, పునరుద్ధరించబడిన ఉద్దేశ్యం, నేటి నిరంతరం మార్పు చెందుతున్న వినియోగదారుని గురించి మరింత స్పష్టమైన అవగాహనతో ఈ రిఫ్రెష్ కు గుండెకాయలా ఒక చిహ్నం ఉంది, అది కాలానికి అతీతంగా పరివర్తన చెందేది - ఫింగర్ ప్రింట్. అది సీతాకోకచిలుక రెక్కలలో అందంగా విలీనం అవుతుంది. అభివృద్ధి చెందిన ఐకాన్ బ్రాండ్ ప్రధాన నమ్మకాన్ని ప్రతి బింబిస్తుంది. జీవితం మారుతున్నప్పటికీ, ఒకరి అసలైన రూపం అలాగే ఉంటుంది. ఈ వ్యక్తిగత ముద్ర - ఒకరి ఆలో చనా విధానం, వంట చేయడం, సృష్టించడం, జీవించడం - దాన్నేఇప్పుడు బటర్‌ఫ్లై వేడుక చేసుకుంటోంది. బటర్‌ఫ్లై యొక్క ఈ కొత్త శకం జీవితం పట్ల 'జిలేనియల్' వైఖరి కలిగిన వినియోగదారులతో నేరుగా మాట్లాడుతుంది వాళ్లు- తాము ఎవరో అనే దానిలో పాతుకుపోయి పరివర్తనను స్వీకరించే స్వీయ-అవగాహన కలిగిన వ్యక్తులు. వారికి, మార్పు స్థిరంగా ఉంటుంది - కానీ ప్రామాణికత అనేది చర్చించలేనిదిగా ఉంటుంది. జనాభాను దాటి సైకో గ్రాఫిక్స్‌కు వెళ్లడం ద్వారా వయస్సుపై కాకుండా వైఖరిపై దృష్టి పెట్టడం ఈ బ్రాండ్ లక్ష్యం - ఎం దుకంటే జిలేనియల్ మనస్తత్వం సంఖ్యలు, సరిహద్దులు లేదా లింగాల ద్వారా నిర్వచించబడదు, కానీ మార్పును ఎలా స్వీకరిస్తారనే దాని ద్వారా నిర్వచించ బడుతుంది. బటర్‌ఫ్లై యొక్క రిఫ్రెష్డ్ పొజిషనింగ్, 'సెలబ్రేటింగ్ చేంజ్' అనేది ఆధునిక భారతీయ గృహాల లోతైన అవగాహనను ప్రతిబింబిస్తుంది. ఇక్కడ మారుతున్న పాత్రలు, హైబ్రిడ్ జీవనశైలి, టెక్-ఇంటిగ్రేటెడ్ లివింగ్ ప్రమాణం అనేవి సాధారణ మైపోతాయి. గృహోపకరణాల్లో భారతదేశ ప్రముఖ సంస్థల్లో ఒకటైన క్రాంప్టన్ అనుబంధ సంస్థగా, బటర్‌ఫ్లై ఇప్పుడు వంటగదిలో, అంతకు మించి రోజువారీ అనుభవాలను మార్చే సహజమైన, ఉద్దేశపూర్వక ఆవిష్కరణలను తీసుకురావడానికి సన్నద్ధమైంది. "40 సంవత్సరాలకు పైగా, బటర్‌ఫ్లై భారతదేశం అంతటా లక్షలాది వంటశాలలలో భాగంగా ఉంది. నేడు, ఇళ్లు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గుర్తింపులు మరింత స్వీయ-నిర్వచితాలవుతున్నాయి. ఈ నేపథ్యంలో మా కొత్త గుర్తింపు మనం ఎవరో మా త్రమే కాకుండా - మనం ఎవరి కోసం ఇక్కడ ఉన్నామో కూడా ప్రతిబింబి స్తుంది" అని బటర్‌ఫ్లై చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శ్వేతా సాగర్ అన్నారు. కొత్త బటర్‌ఫ్లై లోగో కేవలం ఒక చిహ్నం కంటే ఎక్కువ - ఇది మిలియన్ల మంది వినియోగదారులు, రిటైలర్లు, డీలర్లు, ఉద్యోగులు, బటర్‌ఫ్లై ఉత్పత్తులను తయారు చేస్తున్న డిజైనర్ల గుర్తు. ఫింగర్ ప్రింట్ విభిన్న రేఖలరేఖల నుండి రూపొందించబడిన సీతాకోకచిలుక రెక్కలు ఇప్పుడు అది తాకిన ప్రతి వ్యక్తి కథను కలిగి ఉంటాయి. జీవితం ఎంత మారిపోయినా, ఒకరి గుర్తింపు అనేది వంటగది, రోజువారీ లయపై ఒక ముద్ర వేస్తుందనే ఆలోచనకు ఇది ప్రతిరూపం.

## ఏఐ, రోబోటిక్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడమే లక్ష్యం

విజయవాడ, జూన్ 24, మేజర్ న్యూస్ : విద్యార్థుల అసాధారణ విజయాలతో స్ఫూర్తి పొంది, న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ బెంగళూరులో అధునాతన సాంకేతిక విద్యాబోధన కోసం తమ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించింది. న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో రెండో సంవత్సరం అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులలో అసాధారణ స్థాయిలో 93% మంది అగ్రశ్రేణి టెక్ సంస్థలు, ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థలలో ఇంటర్న్‌షిప్‌లు పొందారు. రేజర్‌పే, సర్వం ఏఐ, జూమ్‌కార్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు, డీఆర్‌డీఓ లాంటి గౌరవనీయ పరిశోధనా సంస్థల్లో వీరు ఇంటర్న్‌షిప్‌లు సాధించారు.భారతదేశ ప్రముఖ టెక్, స్టార్టప్ కేంద్రమైన ఎలక్ట్రానిక్ సిటీలో న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సరికొత్త క్యాంపస్‌ను నిర్మించింది. ఉద్యోగాలకు సిద్ధం చేసే ఆచరణాత్మక టెక్ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడం ఈ క్యాంపస్ ప్రధాన లక్ష్యం. ఈ కొత్త క్యాంపస్‌లో 2,500 మంది విద్యార్థులు చదువుకునే వీలు కల్పించారు. అలాగే, 1,000 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలు కూడా ఉంటాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, టెక్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి ప్రత్యేక కోర్సులతో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విద్యా విధానాన్ని రూపొందించారు. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని నిజ జీవిత పరిశ్రమ అనుభవంతో జోడించి, విద్యార్థులు ప్రాక్టికల్ నైపుణ్యాలతో, బలమైన ప్రొఫైల్‌తో, ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుతారు. న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులకు అత్యాధునిక అభ్యాస వాతావరణం కల్పిస్తోంది. ఇక్కడ విద్యార్థులకు రోబోటిక్స్ కోసం ప్రత్యేకంగా ఆన్-క్యాంపస్ మేకర్స్ ల్యాబ్ అందుబాటులో ఉంది. అలాగే, అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్ పరిశోధనా సౌకర్యాలు లభిస్తాయి. ఐసీపీసీ వరల్డ్ ఫైనలిస్ట్, క్రెడ్, మాజీ టెక్ లీడ్ అయిన అశ్విన్ కె, మేక్‌మైట్రిప్, మాజీ ప్రిన్సిపల్ ఇంజినీర్ సౌమిత్ర మిశ్రా, ఇస్రో, మాజీ ఉద్యోగి సిద్ధార్థ్ మాలిక్ లాంటి పరిశ్రమ నిపుణులు రూపొందించిన పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు శిక్షణ పొందుతారు. ఈ వాతావరణం విద్యార్థులలో సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను, ప్రయోగాలు చేసే తత్వాన్ని పెంపొందిస్తుంది. తొలి రోజు నుంచే నిజ ప్రపంచ ఉత్పత్తులను తయారు చేసే దిశగా వారిని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల విద్యార్థులు కేవలం సైద్ధాంతిక జ్ఞానాన్ని పొందడమే కాకుండా, ఆచరణాత్మక నైపుణ్యాలను కూడా నేర్చుకుంటారు. "న్యూటన్ స్కూల్‌లో, మేము టెక్ పరిశ్రమను నేరుగా తరగతి గదిలోకి తీసుకువస్తున్నాం. దీంతో విద్యార్థుల అభ్యాసం మరింత ఆచరణాత్మకంగా, ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా, ఇంకా ప్రభావవంతంగా మారుతుంది" అని న్యూటన్ స్కూల్ సహ-వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ మహేశ్వరి తెలిపారు. "ఈ కొత్త క్యాంపస్‌ను విద్యార్థులందరూ కలిసి పనిచేసే వాతావరణంగా రూపొందించాం. ఇక్కడ విద్యార్థులు కేవలం సిద్ధాంతాలు నేర్చుకోవడమే కాదు, నిజమైన సమస్యలను పరిష్కరించే ఉత్పత్తులను తయారు చేస్తారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చేపడతారు. ఉద్యోగాలకు సిద్ధంగా ఉండే గ్రాడ్యుయేట్లను తయారు చేయడమే కాకుండా, భవిష్యత్ టెక్ నాయకులను, పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడమే మా లక్ష్యం. వీరు రేపటి డిజిటల్ ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తారు" అని సిద్ధార్థ్ వివరించారు. న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కొత్త క్యాంపస్ కేవలం ఒక విద్యాసంస్థ మాత్రమే కాదు. అది భవిష్యత్ నిర్మాణకర్తలు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఒక సమాజం. ఇక్కడ విద్యార్థులకు చైనా, సింగపూర్, సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ ఆవిష్కరణ కేంద్రాలలో నేరుగా పాల్గొనే అవకాశాలు లభిస్తాయి. ప్రాజెక్టులు, హ్యాకథాన్‌లు, పరిశ్రమ సవాళ్ల ద్వారా ఆచరణాత్మక అనుభవాన్ని పొందుతారు. అంతేకాకుండా, అంకితమైన స్టార్టప్ ఇంక్యుబేషన్ సౌకర్యం ఉంటుంది. ఈ క్యాంపస్ సాధారణ కళాశాల కంటే ఎంతో ఉన్నతమైనది. ఇది రేపటి డిజిటల్ ప్రపంచాన్ని తీర్చిదిద్దే యువతను ప్రోత్సహించే ఒక ప్రదేశం.

## విజయవంతంగా ఫిక్కీ బి2బి సమావేశాలు



విజయవాడ మేజర్ న్యూస్ : యుఏఈలోని షార్జా ప్రభుత్వ షార్జా ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ ఫ్రీ జోన్ (సైఫ్ జోన్) భాగస్వామ్యంతో, భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ), యుఏఈ ద్వారా ప్రపంచ మార్కెట్లలోకి భారతీయ వ్యాపారాలు విస్తరించడంలో సహాయపడే లక్ష్యంతో విజయవాడలో ప్రత్యేక బి2బి సమావేశాల శ్రేణిని విజయవంతంగా నిర్వహించింది. ఈ సమావేశాలు విస్తృత శ్రేణిలో మధ్యప్రాచ్య, ఆఫ్రికా, మధ్య ఆసియా, రష్యాలో వాణిజ్యం, వ్యాపార అవకాశాలను గురించి అవగాహన అందించాయి. ప్రపంచ మార్కెట్లలో వ్యాపారాలను విస్తరించడంతో పాటుగా ఎగుమతులు, ఇరు దేశాల నడుమ కార్యకలాపాలను పెంచడానికి భారతదేశం-యుఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సెపా) ను ఉపయోగించడంపై కూడా వారు మార్గదర్శకత్వం అందించారు. ప్రపంచ వ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించడానికి భారతదేశం-యుఏఈ సేపా యొక్క ప్రయోజనాలను ఉపయోగించుకోవడానికి సరైన వేదికగా ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది.

## విపత్తు నిర్వహణ చర్యల్లో అప్రమత్తంగా ఉండాలి



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : విపత్తు నివారణ చర్యలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి అని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా నేతాజీ బ్రిడ్జ్ కృష్ణలంక ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విపత్తు నివారణ చర్యల్లో భాగంగా కృష్ణానది వద్ద ఉండే కృష్ణలంక ప్రాంతం ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. తదుపరి కృష్ణలంక ప్రధాన రహదారి, సాయిబాబా గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించారు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీటి సరఫరా ఆహారంలో నాణ్యత పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం సిబ్బంది పాల్గొన్నారు..



## సోనీ ఇండియా నుంచి రెండవ తరం ఆల్ఫా 12 ఫుల్-ఫ్రేమ్ కెమెరా




విజయవాడ, మేజర్ న్యూస్ : సోనీ ఇండియా తమ రెండవ తరం ఆల్ఫా 1 2ని విడుదల చేసింది. ఇది సోనీ తాజా ఏఐ ప్రాసెసింగ్ యూనిట్ తో శక్తివంతమైన కొత్త ఫ్లాగ్‌షిప్ పూర్తి-ఫ్రేమ్ మిర్రర్ లెస్ ఇంటర్‌ఛేంజ్ లెన్స్ కెమెరా. ఈ కెమెరా సుమారుగా ప్రభావవంతమైన 50.1 ఎంపి (మెగాపిక్సెల్) రిజల్యూషన్ సెన్సార్, ఏఎఫ్, ఏఈ ట్రాకింగ్‌తో 30 ఎఫ్‌పీఎస్ వరకు బ్లాక్‌అవుట్-ఫ్రీ నిరంతర షూటింగ్, యాంటీ-డిస్టోర్షన్ షట్టర్, మిడ్-టు-హై సెన్సిటివిటీల వద్ద మెరుగైన ఇమేజ్ క్లారిటీని కలిగి ఉంది. అధునాతన ఏఐ ఆధారిత సబ్జెక్ట్ రికగ్నిషన్ పనితీరు, అనేక రకాల సబ్జెక్ట్‌లను గుర్తిం చగల కొత్త ఆటో మోడ్‌తో సహా పలు ఫీచర్లను ఏఐ ప్రాసెసింగ్ యూనిట్ తెస్తుంది. ఒక సెకను వరకు ప్రీ-క్యాప్చర్, మెరుగైన, ఆకర్షణీయమైన డిజైన్ ఉన్నాయి. ఈ కెమెరా వివిధ ప్రొఫెషనల్ దృశ్యాలలో ఉపయోగించటానికి అనువుగా సుమారు 743 గ్రాముల బరువును కలిగి ఉంటుంది.

## కె13ఎక్స్ 5జీని విడుదల చేసిన ఒప్పో




విజయవాడ, మేజర్ న్యూస్ : తన విభాగంలో అత్యంత కఠినమైన 5జీ స్మార్ట్ ఫోన్ కె13ఎక్స్ 5జీని ఒప్పో ఇండియా విడుదల చేసింది. ముఖ్యంగా యువ విద్యార్థులు, వృత్తి జీవితాన్ని ప్రారంభించిన నిపుణుల కోసం ప్రత్యేకంగా దీన్ని తయారు చేశారు. స్థితిస్థాపకత కోసం తయారు చేసిన కె13ఎక్స్ 5జీ, ఎస్‌జీఎస్ గోల్డ్ డ్రాప్ సర్టిఫికేషన్, మిలిటరీ-గ్రేడ్ ప్రమాణాలతో వస్తుంది. ఇది దాని శ్రేణిలో అత్యంత దృఢమైన పరికరంగా నిలిచింది. దీని 360 డిగ్రీల డ్యామేజ్-ప్రూఫ్ ఆర్మర్ బాడీ ఏరోస్పేస్-గ్రేడ్ ఏఎం04 అల్యూమినియం మిశ్రమాన్ని ఉపయోగించి తయారు చేశారు. క్రిస్టల్ షీల్డ్ గ్లాస్‌తో బలోపేతం చేసి, డీప్-సీ స్పాంజ్‌లచే ప్రేరణ పొందిన బయోమిమెటిక్ స్పాంజ్ షాక్ అబ్జార్షన్ సిస్టమ్ ద్వారా మెరుగుపరచబడింది. దీనిలోని ఐపీ65 నీరు, ధూళి నిరోధకతతో, ఒప్పో కె13ఎక్స్ 5జీ మన్నికకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుంది.

## కోల్గేట్ ఓరల్ హెల్త్ ఉద్యమంతో 4.5 మిలియన్ల దంత పరీక్షలు



విజయవాడ, మేజర్ న్యూస్ : ప్రస్తుత ప్రవర్తన, ఆదర్శం మధ్య ఉన్న అవగాహన అంతరాన్ని తగ్గించేందుకు కోల్గేట్ నవంబర్ 2024లో ఓరల్ హెల్త్ మూవ్ మెంట్‌ను ప్రారంభించింది. లక్షలాది మంది భారతీయులకు సాధికారత కల్పించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ చేసిన ఈ ప్రయత్నం, వారి మొబైల్ ఫోన్ల ద్వారా వారి నోటి ఆరోగ్యాన్ని పరీక్షించుకునేందుకు, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ భాగస్వామ్యంతో 50 వేల మంది దంత వైద్యుల నెట్‌వర్క్ ద్వారా ఉచిత దంత పరీక్షలను చేయించుకునేందుకు వీలు కల్పించింది. కోల్గేట్ ఓరల్ హెల్త్ మూవ్‌మెంట్‌లో భాగంగా, 700 కన్నా ఎక్కువ జిల్లాలను కవర్ చేసే 18 వేలకు పైగా పిన్ కోడ్‌ల నుంచి దేశ వ్యాప్తంగా 4.5 మిలియన్లకు పైగా భారతీయులు తమ నోటి ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. ఇంకా, వారిలో 1/6వ వంతు మంది దంత వైద్యులను స్క్రీనింగ్ తర్వాత సందర్శించారు. తద్వారా ఈ ఉద్యమం భారతీయులను తదుపరి చర్య వైపు ఎలా విజయవంతంగా నడిపించిందో ప్రతిబింబిస్తుంది.

## ప్రపంచ ఆరోగ్య సంస్థ హాని నిరోధక తగ్గింపు మార్పు భారతదేశాన్ని అసమానంగా దెబ్బతీస్తోంది

CONSUMER CHOICE CENTER

విజయవాడ, మేజర్ న్యూస్ : పొగాకు హాని తగ్గింపుకు వ్యతిరేకంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల చేసిన విధాన మార్పు దశాబ్దాలుగా కొనసాగుతున్న విధానాలకు విరుద్ధంగా ఉండటమే కాకుండా భారతదేశం వంటి దేశాలకు అసమానంగా హాని కలిగిస్తుందని సీపీపీహెచ్ఆర్‌పి హెచ్చరించింది. ఇది పొగాకు కన్నా ఎక్కువ.. ఇది సార్వభౌమాధికారం, సైన్స్, ప్రాణాలను కాపాడటం గురించి అని సీపీపీహెచ్ఆర్‌పి ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ నాన్సీ లూకాస్ నొక్కిచెప్పారు. 'భారతదేశం వెనక్కి తగ్గాలి. హాని తగ్గింపుపై ఆధారాలను విస్మరించే దాత ఆధారిత అజెండాలను తిరస్కరించాలని మేము భారత విధాన నిర్దేతలను కోరుతున్నాము. బదులుగా, సురక్షితమైన నికోటిన్ ఉత్పత్తులను పొందేందుకు, ఆవిష్కరణలను కొనసాగించేందుకు, జీవనోపాధిని రాజీ పడకుండా ప్రజారోగ్యాన్ని రక్షించడానికి మద్దతు ఇచ్చే సైన్స్ ఆధారిత, వినియోగదారు కేంద్రీకృత విధానాలను భారతదేశం సమర్థించాలి' అని సూచించారు.



## విధి నిర్వహణలో తనకు తానే సాటి..

**జగ్గయ్యపేట, జూన్ 24, మేజర్ న్యూస్ :** ఇటీవల జరుగుతున్న ప్రమాదాలకు కారణం ఓవర్ రైడింగ్, ఓవర్ డ్రైవింగ్, మైనర్ బాలురు బాలికలు వాహన చో దకులుగా మారడం వలన పలు ప్రమాదాలు జరుగుతున్న దృశ్య జగ్గయ్యపేటలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్గా విధులు స్వీకరించిన నాటి నుండి నేటి వరకు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ సూచనలు,సలహాలు ఇస్తూ వినని వారికి జరిమానా విధిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావును జగ్గయ్యపేటలో పలువురు అభినందిస్తున్నారు. బస్టాండ్ సమీపంలో ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసిత్రిబుల్ రైడింగ్ మైనర్లు డ్రైవ్ చేయడం బండి డాక్యుమెంట్స్ లైసెన్సు లేకుండా డ్రైవ్ చేయడం ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని పెండింగ్ చలానా ఉన్నవారిని ఆపి తనిఖీలు చేసి మైనర్ పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చి రోడ్డుపైకి లైసెన్స్ లేకుండా మైనార్టీ తీరకుండా రోడ్డుపైకి వస్తే బండి సీజ్ చేస్తామని అలాగే త్రిబుల్ రైడింగ్ చేసిన ఉపేక్షించేది లేదని ట్రాఫిక్ ఎస్ఐశ్రీనివాసరావు మంగళవారం ఒకేంత ఘాటుగా చెప్పడం జరిగింది.

## ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ గణేష్ పుట్టినరోజు వేడుకలు



**పామర్రు జూన్ 24 మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ పాలశీతలీకరణ కళ్యాణ మండపంలో జరిగిన కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ పుట్టినరోజు వేడుకలలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ గణేష్ ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని అలాగే తెలుగుదేశం పార్టీలో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గురుమూర్తి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గణేష్ తో కలిసి తాను తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే వ్యక్తి గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ గుర్తింపుతోనే ఆయనకు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుని పదవి లభించిందన్నారు. రానున్న కాలంలో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గణేష్ తో కేక్ కట్ చేయించి మిఠాయిలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చాట్ల రమేష్, ఘంటా సురేష్, దాలిపర్తి ప్రసాద్, కేదరాశి పల్లి శ్రీను లతో పాటు పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ పంటలో ఎన్నో లాభాలు

ఘంటసాల, మేజర్ న్యూస్: మండల కేంద్రమైన ఘంటసాల మినీ కళ్యాణ మండపంలో ఆయిల్ పామ్ పంటలో ఎలుకల నిర్మూలన పై శిక్షణ ను ఉద్యాన శాఖ, కె.వి.కె సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి పాల్గొని ప్రసంగిస్తూ ఆయిల్ పామ్ పంటలో ఎన్నో లాభాలు ఉన్నాయి అన్నారు. అలాగే ఎలుకల నిర్మూలన ఎలా చేయాలనేది వివరించారు. ఎలుకలు పంటను విధంగా నాశనం చేస్తాయి, వాటి యొక్క జీవిత చరిత్ర, వాటి అసాధారణ ప్రత్యుత్పత్తి, సాముహిక ఎలుకల యాజమాన్యం యొక్క ఆవశ్యకతను వివరించారు. ఎలుకలను పొగ పెట్టుట, బుట్టలు పెట్టుట, మందు పెట్టే విధానాలను వివరిస్తూ ఏ ఏ పద్దతులను అనుసరించాలో వివరించారు. కె వి కే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలో పోషక యాజమాన్యం, నీటి యాజమాన్యం మాగాణులలో వేసుకున్న ఆయిల్ పామ్ పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఉద్యాన శాఖ అధికారి జె. కీర్తి దేవ్ మాట్లాడుతూ శాఖీయ దశలో తీసుకోవలసిన చర్యలు అంతర పంటలు వేసుకునేతప్పుడు పాటించవలసిన జాగ్రత్తలు, ఆయిల్ పామ్ పంటలో ప్రభుత్వం వారు రైతులకు కల్పించే సబ్సిడీలను వివరించారు. కే. వి. కే శాస్త్రవేత్తలు డాక్టర్ వి మంజువాణి, డా. రేవతి, ఉద్యాన, ఆయిల్ పామ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హరి కృష్ణ (ఉండవల్లి అగ్రోస్), సీనియర్ మేనేజర్ (3 ఎఫ్ కంపెనీ) విక్రం రాజ్, రైతు సంఘం అధ్యక్షులు రత్న గిరి రావు ఇతర రైతులు ఆయిల్ పాల్గొన్నారు.

# అక్రమ మట్టి మాఫియాను అరికట్టాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో బీభత్సం సృష్టిస్తున్న మట్టి మాఫియాను అరికట్టాలని వైసీపీ అభిమాని యువనేత బడే గౌతం డిమాండ్ చేశారు. మంగళవారం మోపిదేవి మండలంలోని ఉత్తర చిరువొల్లంక అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని గ్రామ సర్పంచ్ చింత శ్రీనివాసరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సెస్ బ్లాక్ సాయిల్ పేరుతో ప్రభుత్వం నుండి అనుమతిని పొంది, బ్లాక్ సాయిల్ అక్రమంగా తవ్వి, ప్రజాప్రతినిధి సహకారంతో విచ్చలవిడిగా అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నారని అన్నారు. వ్యవసాయ భూమిని 'లెవలింగ్' అనే పేరుతో సర్వే నెం.185/3 భూమిలో 45 రోజుల తాత్కాలిక పర్మిట్ తీసుకున్న నడకుదిటి సురేష్‌బాబు అనుమతికి మించి తవ్వకాలు సాగిస్తున్నారని, మట్టిని ట్రాక్టర్లలో ఎత్తి అమ్మకానికి తరలిస్తుండగా గ్రామంలోని రోడ్లు దురదమయంగా మారి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని, గ్రామ ప్రజలు రోడ్ల పైకి రాలేక పోతున్నారు. భూమి తక్కువ లోతులో తవ్వేలా అనుమతిని తీసుకున్నా, ప్రస్తుతం భారీ లోతు తవ్వకాలు జరుగుతున్నాయని, తవ్వకాల్లో ఊట నీరు బయటకు వస్తోందని, భారీ తవ్వకాల వలన స్థానిక రైతుల పొలాలకు చెందిన గట్టులు, మదింపు మార్కులు మాయమవుతున్నా యని, ఇక్కడి నుంచి అమ్ముతున్న మట్టి కారణంగా చుట్టు ప్రక్కల రైతులు,, స్థానిక గ్రామ ప్రజలకు చాలా నష్టం ఏర్పడుతోందని గౌతమ్ తన అందోళన వ్యక్తం చేశారు. అనుమతిలో పేర్కొన్న మట్టితో పోల్చితే, ప్రస్తుతం తవ్వబడుతున్న మట్టిని కొలవాలని,మట్టిని ఎక్కడికి తరలిస్తున్నారు అనే సమాచారాన్ని ట్రాకింగ్ చేయ్యాలని,అనుమతికి మించిన మట్టిని తీస్తే కఠిన చర్యలు తీసుకోవాలని గౌతమ్ ప్రభుత్వ అధికారులకు,జిల్లా గనుల శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న మట్టి మాఫియాను అరికట్టడంలో ఎమ్మెల్యే విఫలమవుతున్నారని, ఇప్పటికైనా స్పందించి తక్షణమే అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని,మట్టిని కొలిచి అనుమతి మించి నదైతే కేసులు నమోదు చేయాలని,బాధ్యత వహించని అధికారులపై విచారణ జరిపించాలని,రైతులకు సరైన పరిరక్షణ కల్పించాలని గౌతమ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘ అధ్యక్షులు వర్రే బసవరావు, అద్దంకి శేషు,పలువురు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగన్మోహనరెడ్డిలో ఇప్పటికీ పశ్చాత్తాపం లేదు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైయస్ జగన్మోహనరెడ్డిలో ఇప్పటికీ పశ్చాత్తాపం లేదని, ఆత్మవిమర్శ చేసుకోరని అవనిగడ్డ ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ కార్యకర్త సింగయ్య దుర్మరణం నేపథ్యంలో జగన్ వ్యాఖ్యలు ఆయనలోని మానవత్వ లోపానికి, బాధ్యత రాహిత్యానికి పరాకాష్టగా నిలుస్తున్నాయన్నారు. వైసీపీ పాలనలో ఎవరిపై అక్రమ కేసులు పెట్టలేదని జగన్ చెప్పుకోవటం ప్రజలను మోసం చేయటమే అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఐదు వేల ఎకరాల సాగునీటి సమస్యపై తహసీల్దారుకు అర్జీ ఇస్తామంటే వైసీపీ ప్రభుత్వం అక్రమ అరెస్టు, పోలీస్ కవాతులతో భయానక వాతావరణం సృష్టించిన తీరు నియోజకవర్గ ప్రజలు మరిచిపోలేదన్నారు. అనేక ప్రజా సమస్యలపై తాను గళమెత్తిన ప్రతిసారీ తనతో సహా నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులకు హౌస్ అరెస్టు నోటీసులు ఇచ్చిన వైసీపీ పాలకుల తీరు వారి ఓటమికి బాటలు వేసినా జగన్మోహనరెడ్డి ఆత్మ విమర్శ చేసుకోకపోవటం అతని ప్రవర్తనకు నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రజల స్వేచ్ఛను హరించిన జగన్మోహనరెడ్డికి ప్రజలు ప్రజాస్వామ్య వజ్రాయుధం ఓటు హక్కుతో బుద్ధి చెప్పినా ఇంకా అదే ప్రవర్తనతో కొనసాగటం విచారకరమని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వాళ్ళు బాధ్యతగా జీవించాలనే కనీస కర్తవ్యం మరిచిన జగన్ తన మాటలతో, చేతలతో సమాజాన్ని కలుషితం చేస్తున్నాడన్నారు. పార్టీ అధినేతగా కార్యకర్తలను క్రమశిక్షణతో నడిపించాల్సింది పోయి పైశాచిక భాష, వికృత చేష్టలకు వారిని ప్రోత్సహించడం గమనించి ప్రజాతీర్పు తనకి వ్యతిరేకంగా వచ్చిందన్న సత్యాన్ని గమనించకుండా వ్యవహరించడం, అసాంఘిక శక్తులకు పరామర్శల పేరిట మద్దతు పలకడం ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. ఆంధ్ర దేశ రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమని బుద్ధప్రసాద్ అన్నారు.



## స్వచ్ఛసర్వేక్షణ్‌కు జమీదింటకుర్రు, చినపారుపూడి ఎంపిక

**పెదపారుపూడి జూన్ 24 మేజర్ న్యూస్ :** మండలంలో స్వచ్ఛ్ సర్వేక్షణ్ గ్రామీణ్ -2025 పథకం క్రింద ఎంపికైన గ్రామాల్లో త్వరలో కేంద్ర బృందం పర్యటించనున్నట్లు ఎంపిడిఓ జె.విమాదేవి తెలిపారు. ఈ పథకంలో భాగంగా మండల పరిధిలోని జమీదింటకుర్రు, చినపారుపూడి గ్రామాలు సర్వేక్షణ్ గ్రామీణ్ -2025 క్రింద ఎంపికయ్యాయని తెలిపారు. గతంలో ఓడిఎఫ్ గా ప్రకటించబడిన ఈ రెండు పంచాయతీలను ప్రస్తుతం ఓడిఎఫ్ ప్లస్ స్థాయికి తీసుకువెళ్లడానికి అవసరమైన సన్నాహాలు చేయాలని ఆమె కోరారు. జమీదింటకుర్రు గ్రామంలో సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఈ మేరకు ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర బృందం పర్యటన ఖరారైందని త్వరలో బృందం పర్యటించే అవకాశం ఉందని గ్రామాలలో నిర్దేశించిన అంశాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర బృందం పర్యటన సమయంలో వారు అడిగే అన్ని విషయాలపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండి ఆయా గ్రామాల ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఎంపిక కాబడిన రెండు గ్రామాల్లోనూ మండల అధికారుల బృందం, పంచాయతీ కార్యదర్శుల బృందం ఇంటింటికి తిరిగి ప్రస్తుత పరిస్థితిని తెలుసుకొని మెరుగైన స్థితి కోసం నివేదిక అందించాలని కోరారు. ఈ సమావేశంలో మండల పరిషత్ పర్యవేక్షణ అధికారి వంగా శ్రీనివాస్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ షెహనాజ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శివ నాగమణి, వెలుగు ఎపిఎం మహంకాళి రావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు



**పామర్రు జూన్ 24 మేజర్ న్యూస్ :** పామర్రు మండలంలోని సచివాలయాలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ సమస్యలపై స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాకు వినతి పత్రం అందజేశారు. పామర్రులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయనను కలిసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ సమస్యలను విన్నవించారు. గత ఆరు సంవత్సరాలుగా గ్రామాలలో తాము వివిధ పనులను చేస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, హౌసింగ్ శాఖల విధులతోపాటు పలు సర్వేలు అలాగే కొంతమంది బిఎల్ ఓ విధులు కూడా ఏకకాలంలో చేస్తున్నారని, ఇన్ని పనులు చేయడం తమకు ఇబ్బందికరంగా ఉందన్నారు. అయినప్పటికీ తమకు ఇప్పటివరకు ప్రమోషన్ ఛానల్ ను ప్రభుత్వం కల్పించలేదన్నారు. నూతనంగా ప్రభుత్వం క్లస్టర్ విధానం తీసుకురావడంతో రెండు మూడు సచివాలయాలకు ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంతున కేటాయిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పలు పనులు చేస్తూ సతమతమవుతున్న తమకు ఇద్దరి పనిని ఒక్కరే చేయవలసి వచ్చే పరిస్థితి ఏర్పడిందని, దీంతో 100 శాతం పని భారం పొడి తమపై ఒత్తిడి ఉంటుందన్నారు. ఇది పూర్తిగా ఆర్టికల్ 14 కు విరుద్ధమని వారు పేర్కొన్నారు. కస్టర్ విధానం రూపొందిస్తే రేషనలైజేషన్ లో మిగులుగా చూపిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఏ విధంగా ఎక్కడ పోస్టింగ్ ఇస్తారో స్పష్టత లేదన్నారు. అలాగే మిగులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఏ విధంగా గుర్తిస్తారనే అంశంపై కూడా స్పష్టత లేదని వారు తెలిపారు. వీటిపై స్పష్టత, ప్రమోషన్ ఛానెల్ కు సంబంధించి నిర్దేశత మార్గదర్శకాలు విడుదల చేసిన అనంతరం తమ బదిలీలు చేపట్టాలని వారు కోరారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కుమార్ రాజాను వారు కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. కాగా ఈ సమస్యలపై ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కుమార్ రాజా వారికి హామీ ఇచ్చారు.

# నైపుణ్యాభివృద్ధి.. ఆర్థికవృద్ధికి సోపానం

## ప్రతి మండలానికీ నైపుణ్య శిక్షణ కేంద్రం అవసరం
## పీఎం ఇంటర్న్‌షిప్, పీఎం సూర్యఘర్‌పై ప్రత్యేక దృష్టిపెట్టండి
## సమష్టి కృషి, సమన్వయంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేద్దాం
## యోగాంధ్ర స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జిల్లా కృషి భేష్
## దిశ కమిటీ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 24, మేజర్ న్యూస్ :** ప్రణాళికాబద్ధ ఆర్థిక పురోగతికి ముఖ్యంగా యువతలో నైపుణ్యాభివృద్ధి కీలకమని.. ప్రతి మండలంలో స్థానిక పారిశ్రామిక అవసరాలు, అభివృద్ధికి దోహదంచేసే వనరులను దృష్టిలో ఉంచుకొని నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జగ్గయ్యపేట, తిరువూరు శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, కొలికపూడి శ్రీనివాసరావు హాజరైన ఈ సమావేశంలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతి, భవిష్యత్తు కార్యాచరణ, సమస్యల గుర్తింపు, పరిష్కారానికి చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం నాటికి ఏడాది అయ్యిందని, ఈరోజు జిల్లా సమగ్రాభివృద్ధికి కీలకమైన దిశ కమిటీ సమావేశంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, సమన్వయంతో అమలవుతున్న పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించడంతో పాటు పథకాలు, కార్యక్రమాల అమల్లో లోటుపాట్లను గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషిచేసేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సూచనలను పార్లమెంటు సమావేశాల ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని, జిల్లా సమగ్రాభివృద్ధికి మరిన్ని నిధుల సాధనకు కృషిచేయనున్నట్లు తెలిపారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా అడుగులేద్దామని పిలుపునిచ్చారు. జిల్లాలో పీఎం ఆవాస్ యోజన కింద 1,08,836 గృహాలు మంజూరుకాగా 75 శాతం గృహాల గ్రౌండింగ్ జరిగిందని.. 22,293 ఇళ్ల నిర్మాణాలుపూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు వివరించగా.. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వమిచ్చే అదనపు సాయాన్ని ఉపయోగించుకొని నిర్మాణాలను పూర్తిచేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని ఎంపీ సూచించారు.

**పెద్దఎత్తున కిసాన్ మేళాలు నిర్వహించాలి:**

రైతు సేవా కేంద్రాల ద్వారా వరి, పచ్చిరొట్ట, అపరాల విత్తనాల పంపిణీ జరుగుతోందని.. అదేవిధంగా 2025-26లో 14,864 భూసార పరీక్షల నమూనాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 13,949 నమూనాలు సేకరించినట్లు వ్యవసాయ అధికారులు వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా ఖరీఫ్ - 2025కు సంబంధించి పీఎం ఫసల్ బీమా యోజన పథకంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను పరిచయం చేసేందుకు, దిగుబడులు తద్వారా ఆదాయాలు పెరిగేందుకు దోహదపడే కిసాన్ మేళాలను పెద్దఎత్తున నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఎంపీ సూచించారు. 2025-26లో 46,118 మంది రైతుల ద్వారా 21,993 హెక్టార్లను ప్రకృతిసాగులోకి తీసుకొచ్చే లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేయాలన్నారు. పీ4 విధానం అమల్లో జిల్లాను ముందు నిలిపేందుకు కృషి: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేదరిక నిర్మూలనకు వినూత్న విధానమైన పీ4 విధానం అమల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు టీమ్ ఎన్టీఆర్ కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాలను చేరుకునేందుకు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా జిల్లా పారిశ్రామికంగా మరింత ముందుకెళ్లేందుకు వీలుంటుందన్నారు. దిశ సమావేశంలో సాక్షమ్ అంగన్వాడీలు, మైలవరం, వీరుళ్లపాడు, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, ఎ.కొండూరు మండలాలను కవర్‌చేసే స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ (ఎస్‌వీఈపీ) బ్లాక్, పీఎం విశ్వకర్మ యోజన, జిల్లాలో మూడు దశల్లో మంజూరైన 29 పీఎం శ్రీ స్కూళ్లు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి పథకాల అమలు, పీఎం సూర్యఘర్, పీఎం ఇంటర్న్‌షిప్ తదితరాలపై ప్రభావవంతమైన చర్చ జరిగిందని.. సమావేశంలో లేవనెత్తిన అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, సీపీవో వై.శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఈవో డీఎంఎఫ్ విజయకుమారి, డ్వామా పీడీ ఎ.రాము, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, హౌసింగ్ పీడీ పి.రజనీకుమారి, డీఈవో యూవీ సుబ్బారావు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ సరుకులు అందక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు



**నాగాయలంక మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలం పర్ర చివర పంచాయతీ మెరకపాలెం గ్రామస్తులు గవర్నమెంట్ వారి ఆదేశానుసారము సివిల్ సప్లై అధికారులు ఇచ్చు రేషన్ బియ్యం సరుకులు వయసు ప్రభావము చేత రెండు మూడు కిలోమీటర్లు నడవలేక మోకాళ్ళ నొప్పులు ముసలితనం అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గ్రామస్తులు చాట్రగడ్డ సంజీవరావు కర్రా విక్టోరియా గాలి బాబు ప్రసాద్ తదితరులు నాగాయలంక మండల రెవెన్యూ అధికారి ఆంజనేయ ప్రసాద్ వద్దకు వచ్చి వారికి గల బాధను వ్యక్తపరుచుతూ వారికికలుగుతున్న అసౌకర్యాల గురించి బాధను వ్యక్తపరిచినారు వెంటనే మండల రెవెన్యూ అధికారి ఆంజనేయ ప్రసాద్ సివిల్ సప్లై అధికారులతో సంప్రదించి వారి సమస్యను స్థానిక రేషన్ డీలర్ తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలియజేసినారు గ్రామస్తులు అవసరమైనచో మా గ్రామంలోని ఒక ఇంటిలో ఒక భాగమును రేషన్ డీలర్‌కి ఇచ్చి రేషన్ ఇవ్వమని కోరి ఉన్నారు.

## గుడ్లవల్లేరులో 2870 విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలము లోని మొత్తం 65 జిల్లా, మండల పరిషత్, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలల్లోని 2870 మంది విద్యారినీ, విద్యార్థులకు శ్రీ సర్వేపలి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు మండల విద్యా శాఖ ద్వారా పంపిణీ చేసినట్లు ఎంఇఓలు జి. జగన్మోహనరావు, జి.గోపాలరావులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి మిత్ర కిట్లలో నోట్ బుక్స్, యూనిఫాం, బెల్టులు, సాక్సులు, బూట్లు, బ్యాగ్స్, టెక్స్ట్ బుక్స్ పాఠశాలల ద్వారా అందచేసామని, యికపై వచ్చే అడ్మిషన్లకు తర్వాత అందచేయడం జరుగుతుందని ఎంఇఓలు జగన్మోహన రావు, గోపారావులు తెలిపారు.



## ప్రధాని నరేంద్ర మోడి 11వ సం. విజయత్సవ వేడుక

**నాగయలంక మేజర్ న్యూస్ :** నాగాయలంక మండల బిజెపి పార్టీ వారు మన ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశానికి 11 సంవత్సరాలుగా అద్భుత సేవలు అందించిన సందర్భంగా వారి పరిపాలన ప్రశంసిస్తూ నాగాయలంక లో మండల పార్టీ సర్వసభ్య సమావేశం, బూత్ కన్వీనర్లు సభ్యుల అందరితో కలిపి అభినందన సభ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. దీనికి నాగాయలంక మండల అధ్యక్షుడు గుడివాక శివాజీ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిరువోలు బుచ్చిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళీకృష్ణ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లభుని బిక్షం, జిల్లా కార్యదర్శి దొండపాడు శ్రీనివాస్ రావు,, విద్యా వికాస్ ప్రిన్సిపాల్ శేషు కుమార్ అలాగే స్కాలర్ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ పట్నాయక్ పూర్వ నాగాయలంక మండల అధ్యక్షులు కన్నా నాని సీనియర్ బిజెపి కార్యకర్త చన్నగిరి లతా మోహన్ మొదలగువారు అంత నరేంద్ర మోడీ 11 సంవత్సరాలు పాలనను పూర్తిస్థాయిలో విశ్లేషించారు.

## శ్రీకొండలమ్మ హుండీ ఆదాయం రూ.31,81,084లు



**గుడ్లవల్లేరు జూన్ 24 మేజర్ న్యూస్:** మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మ వారి దేవస్థానంలోని హుండీలను మంగళవారం ఉదయం 9 గంటలకు మచిలీపట్నం, రంగనాయక స్వామి వారి దేవస్థానం, కార్యనిర్వహణాధికారి ఎమ్.సత్యప్రసాద్ బాబు శ్రీ అమ్మ వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, గుడ్లవల్లేరు పోలీసు సిబ్బంది, వడ్లమన్నాడు ఇండియన్ బ్యాంక్ సిబ్బంది సమక్షంలో తెరిచి లెక్కించగా మొత్తం 51 రోజులకు గాను నోట్లు ద్వారా 29లక్షల 11వేల 5వందల 16 రూపాయలు, చిల్లర ద్వారా 2లక్షల 69వేల 5వందల 68 రూపాయలు వెరసి మొత్తము 31లక్షల 81వేల 84 రూపాయలు వచ్చియున్నది. సదరు హుండీ లెక్కింపు కార్యక్రమములో దేవస్థానము సిబ్బంది, సేవా సమితి, వేమవరం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారని ఈఓ ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## భవిష్యత్తును బుగ్గి పాలు చేసుకోకం




**మొవ్వ (జూన్ 24) మేజర్ న్యూస్ :** యువత మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని విఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి విద్యార్థిని, విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన మొవ్వ వి ఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల సోషల్ సైన్సెస్ వారి ఆధ్వర్యంలో కళాశాలలో మాదకద్రవ్యాల పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాధవి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని ప్రిన్సిపాల్ మాధవి విద్యార్థినీ విద్యార్థులకు హితువు పలికారు. అనంతరం మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను ప్లే కార్డుల ద్వారా విద్యార్థులు ర్యాలీలో ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.ఆర్ మంజుల, లైబ్రరియన్ డాక్టర్ శ్రీకాంత్, పలువురు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవినేని ఉమా పై తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి



**నందిగామ, జూన్ 24, మేజర్ న్యూస్:** మాజీమంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు పైఏ ఆధారాలు లేకుండా,తప్పుడు వార్త వ్రాసి ఉమా వ్యక్తిత్వాన్ని కించపరచాలని ఏపీ న్యూస్ ఛానల్ తప్పుడు ప్రచారం చేసింది. కనుక, ఛానల్ పై కేసుకట్టి,రిజిస్టర్ చేసి శిక్షించాలని నందిగామ పోలీస్ స్టేషన్లో మంగళవారం నాడు అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం తరుపున ఎన్టీఆర్ ఫాన్స్ అధ్యక్షుడు వడ్డెల్లి సాంబశివరావు రిపోర్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం సభ్యులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# గరంగరంగా కౌన్సిల్



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం వాడీవేడీగా సాగింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశం లో 156 అంశాలు చర్చకు రాగా పలు అంశాలను కౌన్సిల్ లో ఆమోదించారు. అయితే ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగం ద్వారా నగరంలోని రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా పై ఉద్యోగుల పనితీరు సక్రమంగా లేదని కార్పొరేటర్లు మేయర్ వద్ద ప్రస్తావించారు. దీంతో మేయర్ అధికారులపై మండిపడ్డారు. ఇన్ చార్జి కమిషనర్ కు విధుల్లో అలసత్వం వహిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఐలా కు మంచినీటి పన్ను కట్టించుకొని మంచి నీరు సరఫరా చేయాలని టీడీపీ ప్రతిపాదించగా వైసీపీ తిరస్కరించింది. ఐలా అనేది స్వతంత్ర సంస్థ అని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఐలా కు మంచినీటి ప్రతిపాదనను తిరస్కరించడం సరైంది కాదని టీడీపీ ప్రశ్నించగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐలా కు మీరెందుకు మంచినీరు ఇవ్వలేదని మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఎదురు దాడికి దిగారు. దీంతో కౌన్సిల్ ఒక్కసారిగా వేడెక్కింది. అయినా ఐలాకు మంచినీటి ప్రతిపాదనను కౌన్సిల్ తిరస్కరించింది. అదేవిధంగా మంచినీటి సమస్యపైనా కౌన్సిల్ లో చర్చ జరగగా వర్షాకాలంలో నీరు రంగు మారినా ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా, మంచినీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు తగు సూచనలు చేశారు. మరోవైపు ఆస్తిపన్ను పై ఇటీవల విడుదల చేసిన సర్క్యులర్ పై సీపీఎం కార్పొరేటర్ బోయ సత్తిబాబు ప్రశ్నించగా 20 శాతం వసూలు కు సర్క్యులర్ వచ్చిందని కాని ఏరియా వైజ్ గా ఉన్న రిజిస్ట్రేషన్ వాల్యూ ప్రకారమే పన్నులు వసూలు చేస్తున్నామని అధికారులు వివరణ ఇచ్చారు. అయితే వైసీపీ హయాంలో బాదుడే బాదుడు అన్న టీడీపీ కూటమి ప్రభుత్వం తాజా సర్క్యులర్‌తో సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందనడంతో కౌన్సిల్‌లో టీడీపీ ఎదురుదాడికి దిగింది. దీంతో వైసీపీ జోక్యం చేసుకోవడంతో గదరగోళంగా మారింది. త్వరలోనే ఆస్తి పన్ను పై టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు రాయన భాగ్యలక్ష్మి.

**వీఎంసీ ఇంజనీరింగ్ విభాగాల అధికారులపై కార్పొరేటర్ల గరం గరం**

ప్రజలకు జవాబూదారీతనంగా ఉండే ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని కౌన్సిల్ వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు ప్రశ్నించారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా నగరంలో ని రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా పై ఉద్యోగులు ఏం అడిగినా నిర్లక్ష్యం గా సమాధానం చెప్తున్నారని, పనులు కూడా నత్తనడకన సాగుతున్న పర్యవేక్షించడం లేదని కార్పొరేటర్లు మేయర్ వద్ద ప్రస్తావించారు. అలాగే విద్యుత్ విభాగంలో కొన్ని ఏరియాల్లో మంజూరైన పనులకు కాంట్రాక్టుదారులకు ఎక్కడ పనిచేయాలో చూపించలేనంత బిజీ అయిపోయారని మండిపడ్డారు. దీంతో అధికారులను మేయర్ నిలదీశారు. విధుల్లో నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఇన్ చార్జి కమిషనర్‌ను కోరారు.

## బెజవాడ అభివృద్ధే మా లక్ష్యం

**ప్రజా సమస్యల పరిష్కారంపై రాజీ పడే ప్రసక్తే లేదు**

**ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకొనేలా కౌన్సిల్ లో నిర్ణయించాం**

**మేయర్ రాయన భాగ్యలక్ష్మి**



విజయవాడ నగర అభివృద్ధి కోసం కౌన్సిల్ సమావేశంలో పెట్టిన అనేక తీర్మణాలను అమోదించడం జరుగుతుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మీ తెలిపారు. నగరంలో మంచి నీరు సమస్య ఉందని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు తగిన సూచనలు చేసినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పైప్ లైన్లు మార్చాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం అనంతరం మేయర్ రాయన భాగ్యలక్ష్మి విలేఖరులతో మాట్లాడుతూ మొత్తం 156 సబ్జెక్టు లు సభలో చర్చించామన్నారు. ఇంజినీరింగ్ విభాగం ద్వారా నగరంలోని రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా సమస్యలపై సమగ్రమైన చర్చ సాగిందని ఆమె పేర్కొన్నారు. విజయవాడలో మంచినీటి సమస్య ఉందని గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులకు తగిన సూచనలు చేసినట్లు తెలిపారు. కొండ ప్రాంతాల్లో కొత్త వాటర్ పైప్ లైన్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత 50 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్య సభ దృష్టికి వచ్చిందని, ప్రస్తుతం రూ.15,000 వేతనం పొందుతున్న కార్మికులకు రూ.21,000 వేతనం చెల్లించేందుకు వచ్చే కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని నిర్ణయించామని మేయర్ వెల్లడించారు. అగ్రికల్చర్, వాటర్ సప్లై విభాగాల్లో కొంతమంది కార్మికులను నియమించే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

## వైసీపీ సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు

**ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారు**

**టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి**




వైసీపీ సభ్యులు తమకు ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే సభ్యులను సస్పెండ్ చేస్తామని బెదిరించడం దారుణమని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడ నగర అభివృద్ధి జరుగుతున్నందున అది ఓర్చలేకే ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని విమర్శించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో అధికార వైసీపీ సభ్యుల ప్రవర్తనపై టీడీపీ ఫ్లోర్ లీడర్ బాలస్వామి తీవ్రంగా మండిపడ్డారు. ఆటోనగర్ ప్రాంతంలోని ఐలాకు మంచినీరు అందించాలన్న కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్ చేసిన ప్రతిపాదనను తిరస్కరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. కృష్ణానది ఒడ్డున ఉన్న విజయవాడ నగరంలో మంచినీటి కొరత ఉండదని ప్రతి ఒక్కరూ భావిస్తారని బాలస్వామి తెలిపారు. అలాంటప్పుడు ఆటోనగర్ లాంటి ప్రాంతానికి తాగునీరు అందించకపోవడం ప్రభుత్వ అసమర్థతను సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ప్రజా ప్రయోజనాల తీర్మానాలతో పాటు మరికొన్ని అంశాలను కౌన్సిల్‌లో పెట్టినప్పటికీ అవి తిరస్కరించబడ్డాయని పేర్కొన్నారు. ఎందుకు తిరస్కరించారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. చర్చ జరగాలని తమకున్న అభిప్రాయాన్ని ఎన్నిసార్లు చెప్పినా పాలక పక్షం వినిపించుకోవడం లేదని తెలిపారు.

**కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్**

ఒంటెద్దు పోకడలతో కౌన్సిల్ లో పాలక పక్షం పని చేస్తుందని కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ మండిపడ్డారు. కౌన్సిల్‌లో కూటమి నాయకులు తీసుకొచ్చిన అనేక ప్రజా ప్రయోజనమైన ప్రతిపాదనలను తిరస్కరించడం దారుణమని ఆయన అన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో విజయవాడ నగరం ను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఐలాకు మంచినీరు ఇవ్వాలని అడిగినందుకు టీడీపీ సభ్యులను సస్పెండ్ చేయాలని ప్రతిపాదించడం ఏమిటి? మంచి నీరు అడిగితే సస్పెండ్ చేస్తారా?" అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే కాకుండా ప్రజల సమస్యలను పట్టించుకోని తీరు స్పష్టంగా చూపుతోందని విజయకుమార్ తెలిపారు.

## ఆస్తి పన్ను పెంచాలని కూటమి ప్రభుత్వం యోచిస్తుండడం దురదృష్టకరం

**ప్రజల పై భారాలు మోపుతూ అడ్డగోలు నిర్ణయాలు**

**సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయ సత్తి బాబు**




గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మోసంలో తేడా లేదని, రెండూ ప్రజలను నమ్మించి తప్పుదోవ పట్టించాయని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయ సత్తి బాబు విమర్శించారు. ప్రజలపై భారాలు మోసేందుకు మాత్రమే వీరు పని చేస్తున్నారంటూ విమర్శించారు. ప్రజలు సీపీఎం పార్టీతో కలిసి పోరాటానికి వచ్చేందుకు సిద్ధం కావాలని బోయ సత్తిబాబు కోరారు. ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను పెంచాలని ప్రభుత్వం యోచిస్తుండటం దురదృష్టకరమని విమర్శించారు. దీని ప్రకారం 20 శాతం వరకు పన్ను లు పెంచి ప్రజల పై భారం మోపాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. పన్ను పెంపుదల ద్వారా నగర ప్రజల నుండి రూ.40 కోట్ల ఆదా యం రాబట్టాలన్న ప్రభుత్వ ఉద్దేశం ఉందని పేర్కొన్నారు. "బాదుడే బాదుడు" అని గగ్గోలు పెట్టిన నాటి వారు నేడు పాలక పక్షంలో ఉన్నా ఎటువంటి తేడా కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

కార్పొరేషన్‌లో అధికారులు తగ్గిపోతున్నారని, ఇంచార్జ్‌ల ఆధిపత్యం పెరిగిపోతోందని అరోపించారు. కూటమి పాలన ప్రారంభమై ఏడాది అయినా, కార్మికుల నియామకం జరగలే దని, మునిసిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. అదనపు పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేశారు. 800 మంది లబ్ధిదా రులకు ఐదేళ్లుగా ఇళ్లు ఇవ్వకపోవడం దారుణం అని అన్నారు. అలాగే, టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని గత కౌన్సిల్లో ఆమోదించినా, ఇప్పటివరకు అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఐలాకు మంచినీరు ఇవ్వాలన్న ప్రతిపాదనను తిరస్కరించడాన్ని తప్పుపడుతూ, ఇది ప్రజా ప్రయోజనాల విరుద్ధంగా ఉన్న చర్య అని అన్నారు. భూ అక్రమాల విషయానికి వచ్చేసరికి, విజయవాడలో భూ కబ్జాలు అధికంగా జరుగుతున్నాయని, కామన్ సైట్లను ఆక్రమిస్తూ, 100 ఎకరాల భూమిని ల్యాండ్ మాఫియా కబ్జా చేసినట్లు ఆరోపించారు.

**ముమ్మినేని ప్రసాద్ కార్పొరేటర్**



ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై సభలో చర్చకు ఆస్కారం లేకపోవడం విచారకరమని కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్ అన్నారు. ముఖ్యంగా తాగునీటి అవసరాలపై ఎలాంటి చర్చ జరగలేదని తెలిపారు. ఏపీఐఐసీ జామత్ హౌసింగ్ సొసైటీ వారు కార్పొరేషన్‌కు పన్నులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా, తాగునీరు ఇవ్వకపోవడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. తాము తీర్మానం పెట్టగా, పాలకపక్షం తమకు ఉన్న మెజార్టీ ఆధారంగా దాన్ని తిరస్కరించిందని, కనీసం ఎందుకు తిరస్కరించారో కూడా వివరణ ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు.

## మేయర్ స్థానంలో కౌన్సిల్‌ను నడిపిన డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

**అనివార్య కారణాల రీత్యా మధ్యాహ్నం నుంచి హాజరుకాని మేయర్**





విజయవాడ నగరపాలక సంస్థ సర్వ సభ్య సమావేశంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ కౌన్సిల్‌ను మధ్యాహ్నం నుంచి నడిపారు. ఉదయం కౌన్సిల్ సమా వేశాన్ని మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించగా మధ్యాహ్నం భోజన విరామ అనంతరం అనివార కారణాల రీత్యా ఆమె కౌన్సిల్‌కు హాజరుకా లేదు. దీంతో 34వ అంశం నుంచి బెల్లం దుర్గ కౌన్సిల్ ను నడిపించారు. వైసిపి, టిడిపి, సిపిఎం కార్పొరేటర్ల మధ్య వాదోప వాదాల సమయంలోనూ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మేయర్ స్థానంలో సభను కంట్రోల్ చేశారని పలువురు కార్పొరేటర్లు అభినందించారు. కార్పొరేటర్లు అడిగిన పలు ప్రశ్నల కు అధికారులతో జవాబులు చెప్పించడంలోనూ ఆమె కీలకంగా మేయర్ స్థానంలో నిర్వహించిన పాత్ర అమోఘమన్నారు పలువురు కార్పొరేటర్లు.





# హస్తకళలపై సావనీర్ డిజైన్ పోటీలు

## లేపాక్షి చైర్మన్ డా. పి.హరిప్రసాద్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** చేనేత హస్త కళాకారులు, కార్మికులు, డిజైన్స్, చేతిపనుల పట్ల మక్కువ కలిగి సృజనాత్మక అభిరుచి కలిగిన ఔత్సహికుల నుండి హస్తకళల పై సావనీర్ డిజైన్ పోటీలలో పాల్గొనేందుకు దరకాస్తులు కోరుతూ అవకాశం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సాంప్రదాయ హ్యాండీక్రాఫ్ట్‌లు, హ్యాండ్లూమ్స్‌లలో కొత్త సావనీర్ డిజైన్లను సృష్టించేందుకు జాతీయ డిజైన్ సంస్థ రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలను నిర్వహించన్నట్లు ఆయన తెలిపారు. 8 సంవత్సరాల వయస్సు పైబడి రాష్ట్రానికి చెందిన కళాకారులు, వీవర్స్, డిజైనర్లు, విద్యార్థులు ప్రజలు పోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. హస్తకళలపై సామర్థ్యాన్ని పెంచడం, సాంప్రదాయ కళాకృతులు, ఆధునిక డిజైన్లను కలిపిన కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. హ్యాండీక్రాఫ్ట్స్‌కు సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కొండపల్లి బొమ్మలు, అనకాపల్లి జిల్లాకు చెందిన ఎటికొప్పాకబొమ్మలు, తిరుపతి జిల్లాకు చెందిన చెక్కతో చెక్కవేతనం, కృష్ణా జిల్లాకు చెందిన కళంకారి బ్లాక్ ప్రింట్స్, శ్రీసత్య సాయిజిల్లాకు చెందిన చర్మపప్పెట్రీ అంశాలపై ధర్మవరం సిల్క్స్, ఉప్పాడ సిల్క్స్, వైస్ట్ కోట్స్, మంగళగిరి, బందర్, రాజమహేంద్రవరం, కృష్ణ, తూర్పు గోదావరి జిల్లాల హ్యాండ్లూమ్స్‌లపై పోటీలను నిర్వమిస్తున్నట్లు తెలిపారు. హ్యాండీక్రాఫ్ట్స్ ఆంధ్రప్రదేశ్ సావనీర్‌లలో న్యూమాటిక్, ఆటోమేషన్, కొత్త డిజైన్లను హ్యాండ్లూమ్స్‌లో పాల్స్, స్కార్ఫ్స్, ట్కెస్, వైస్ట్ కోట్స్ వంటి ఉపయుక్త వస్తువులను పరిచడం చేయాలన్నదే పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. పోటీలలో వివిధ విభాగాలకు చెందిన ముగ్గురు ఉత్తమ విజేతలకు నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని, హ్యాండీక్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్స్‌లలో ఒక్కొక్క విభాగంలో ఐదుగురు మొత్తంగా పదిమందికి మొదటి బహుమతిగా 25 వేల రూపాయలు, రెండవ బహుమతిగా 15 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 10 వేల రూపాయలను పారితోషకంగా అందించడం జరుగుతుందన్నారు. జూల్కై 16వ తేదీ లోగా కొత్తగా సృష్టించిన సావనీర్ సమూనాలను రాష్ట్రంలోని సమీప లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో సమర్పించాలన్నారు. పోటీల ప్రక్రియను లేపాక్షి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం విశ్వ పర్యవేక్షిస్తారన్నారు. ఇతర వివరాలకు లేపాక్షి వెబ్ సైట్ https://lepakshihandicrafts.gov.in ఆప్కో వెబ్ సైట్ https://www.apcofab-rics.comను సందర్శించవచ్చునని లేపాక్షి చైర్మన్, పసుపులేటి హరిప్రసాద్ ఆ ప్రకటనలో తెలిపారు.

## సీఎం, డిప్యూటీ సీఎం చేతులు మీదుగా ధ్రువపత్రాన్ని అందుకున్న కలెక్టర్, ఎస్పీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యోగాంధ్ర మాస ఉత్సవాలలో సుప్రసిద్ధ నాట్యమైన కూచిపూడి నృత్య భంగిమను అత్యధిక మందితో వినూత్న రీతిలో యోగా ఆసనాలు చేయించినందుకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోగా, దానికి సంబంధించిన అభినందన ధ్రువ పత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అందుకున్నారు. ఇంతటి గౌరవప్రదమైన కార్యక్రమ నిర్వహణకు విశిష్ట కృషి చేసిన జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# హడావిడిగా పంట కాలువ పనులు




### ఫోటోలకే పరిమితమవుతున్న ఉపాధి హామీ పనులు

### కాలువలకు నీరు వచ్చే సమయంలో లెవెలింగ్ పనులు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రజా ప్రతినిధుల అలసత్వం ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో నియోజకవర్గంలోని వంటకాలవ పనులు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో కృష్ణా బ్యారేజ్ వద్ద ఈనెల 15వ తేదీన కృష్ణాజిల్లా ఎమ్మెల్యేలు నీటిని విడుదల చేశారు. సంబంధిత అధికారులు మంగళవారమే నిద్ర లేచినట్టున్నారు. హడావుడిగా అవనిగడ్డలోని లాకుల వద్ద లెవెలింగ్ చేసేటందుకు శ్రీకారం చుట్టారు ఈనెల 27వ తేదీన పులిగడ్డ వార్పు వద్ద కోడూరు నాగాయలంక పంట కాలువలకు తాగు నీరు, సాగునీరు విడుదల చేయనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం హడావిడిగా ఇరిగేషన్ అధికారులు కాలువల లెవెలింగ్ కొలతలు తీస్తూ కనిపించారు.లెవలింగ్ కొలతలు ఇప్పుడు తీసి 27వ తేదీ కాలువలు వచ్చే సమయానికి తూతూ మంత్రంగా పనులు పూర్తిచేసి మమ అనిపిస్తారే తప్ప ఈ పనులు వలన రైతులకు గాని తీర ప్రాంతాలలో ప్రజలకు గాని ఏమాత్రం ఉపయోగం ఉండదు.

**ఇరిగేషన్, ఉపాధి అధికారులకు సమన్వయ లోపం**

పంట కాలవలుకు తాగునీటి సరఫరా నిలిపివేసి 40 రోజులు కావస్తున్న 40 రోజుల నుండి ఎక్కడ ఉన్నారో కూడా తెలియని ఉపాధి హామీ పథకం అధికారులు సోమవారం నిద్రలేచి 150 మంది ఉపాధి హామీ కూలీలచే కోడూరు లాకులు వద్ద నుండి పనులు ప్రారంభించారు. రెండో రోజు మంగళవారం మరో 100 మంది పైగా ఉపాధి కూలీలతో లాకులు వద్దనుండి కనీసం 50 మీటర్ల పొడవు కూడా పనిని పూర్తి చేయలేకపోయారు. ఇరుశాఖల అధికారులకు సమన్వయం లేకపోవడంతో ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో అవనిగడ్డ నుండి అశ్వారావు పాలెం పంట కాలవకు ఒకే పనికి రెండు బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సంవత్సరం ఖరీఫ్ పూర్తికాగానే పంట కాలవలకు సాగునీటి సరఫరా నిలిపివేశారు. ఈ మూడు నెలల నుండి లెవలింగ్ చూడని అధికారులు పంట కాలవలకు సాగు నీరు వచ్చే సమయంలో ఆదుర్దా పడుతూ లెవెలింగ్ కొలతలు వేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి రైతులకు ఉపయోగపడే విధంగా ఇరిగేషన్ ఉపాధి హామీ పథకం పనులు పూర్తిచేసి నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని రైతాంగం కోరుతున్నారు.



## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిఐపిఆర్ఓ

### డీఐపీఆర్ఓగా కె.వి. రమణరావు పదవీ భాధ్యతలు స్వీకరణ



**విజయవాడ, జూన్ 24, మేజర్ న్యూస్ :** సమాచార పౌర సంబంధాల శాఖ ఎన్‌టిఆర్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.వి. రమణారావుకు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసారు. ఏలూరు జిల్లా సచామార పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్న కె.వి. రమణరావును ఎన్‌టిఆర్ జిల్లాకు బదిలీ చేస్తూ సమాచార డైరెక్టర్ ఉత్వర్తులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లా పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్న యు. సురేంద్రనాథ్ నుండి సోమవారం కె.వి. రమణరావు పదవీ బాధ్యతలను తీసుకున్నారు. ప్రభుత్వ శాఖలలో అత్యంత కీలకమైన సమాచార పౌరసంబంధాల శాఖలో డిఐపిఆర్ఓగా సమర్ధవంతంగా పని చేసి ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించడంలోను అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు మధ్య సమన్వయం చేస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కె.వి. రమణరావుకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో డిఐపిఆర్ఓ వెంట డి పి ఆర్ ఓ ఎస్. వి.మోహన్ రావు, డివిజనల్ పిఆర్ఓ కె. రవి, ఏవీఎస్ వి.వి. ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## జిల్లా రవాణాశాఖ అధికారిగా పి.మురళీధర్





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లా రవాణాశాఖ అధికారిగా మంగళవారం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన పి.మురళీధర్ మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మను కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి మొక్కలు అందజేశారు.. ఆయన కడప జిల్లా ప్రొద్దుటూరులో జిల్లా రవాణా శాఖ అధికారి గా పనిచేస్తూ ఇటీవల బదిలీపై కృష్ణా జిల్లాకు వచ్చారు.

## కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఎఎస్ఎన్.రాధిక





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగాగా మంగళవారం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన, ఎ ఎస్ ఎన్ రాధిక మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మను కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి మొక్కలు అందజేశారు.

## ఆదిత్య టీవీ రిపోర్టర్ ఫణి కుమార్ మృతి పట్ల సంతాపం తెలిపిన జిల్లా ఎస్పీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆదిత్య టీవి రిపోర్టర్ ఫణి కుమార్ అకాల మృతి పట్ల కృష్ణాజిల్లా పోలీస్ శాఖ తరపున జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సంతాపం తెలియజేశారు. ఫణి కిరణ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,ఆయన పవిత్రాత్మకు శాంతి కలుగాలని కోరుకున్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999